ప్లాస్టిక్ వస్తువులను అనుమతించొద్దు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

కవాడిగూడ: ఇందిరాపార్కును ప్రతిరోజు శుభ్రంగా ఉంచి పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శుక్రవార యూబీడీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇందిరాపార్కును ఆయన సందర్శించి వాకర్లతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్ వేస్ట్‌ను ప్రతిరోజు తొలగించాలని అధికారులకు సూచించారు. పార్కులోని ఓపెన్ జిమ్, వాటర్ ఫౌంటెను, బటర్ ఫ్లై పార్కు ఏరియా, యోగా షెడ్లు తదితర ప్రాంతాలను పరిశీలించారు. వాటర్ ఫౌంటెయిన్‌లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సందర్శకులు పార్కులోకి ప్లాస్టిక్ వస్తువులు తీసుకురాకుండా నిరోధించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఇందిరాపార్కు సిబ్బంది పాల్గొన్నారు.

బర్కత్‌పుర డిపోలో బోనాల వేడుకలు

కాచిగూడ: బర్కత్‌పుర డిపో ప్రాంగణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో శుక్రవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ, కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి, డీఎం ఆర్.మంజులారెడ్డి, అధికారులు శంకర్‌నాయక్, బాబు నాయక్, రఘునందన్, జయలక్ష్మి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.లక్ష్మయ్య, అడ్వైజర్ జగదీష్, కార్యదర్శులు మైబూస్, మమత పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డిపో గేటు ఎదుట, గ్యారేజీలోని అమ్మవారి ఆలయం వద్ద గుమ్మడి కాయలు కొట్టారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి అనంతరం డిపో కార్మికులు, సిబ్బందికి అన్నదానం చేశారు.

ఏబీవీపీ నారాయణగూడ కార్యదర్శిగా ఆకాష్

కాచిగూడ: ఏబీవీపీ నారాయణగూడ పట్టణ కార్యాదర్శిగా ఆకాష్ ఎన్నికయ్యారు. శుక్రవారం నారాయణగూడ కేశవ మెమోరియల్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆకాష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం, ప్రజల కోసం పనిచేసే విద్యార్థి సంఘం ఏదైనా ఉంది అంటే అది అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని అన్నారు. జ్ఞానం, శీలం, ఏక్తా అనే మూడు నినాదాలతో 76 సంవత్సరాలుగా ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ నిలిచిందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

శ్మశానవాటిక ట్రస్ట్ బోర్డు ప్రధాన కార్యదర్శిగా రమేష్‌యాదవ్

కాచిగూడ: హరాస్‌పెంటలోని హిందూ శ్మశానవాటిక ట్రస్టుబోర్డు ప్రధాన కార్యదర్శిగా రమేష్‌యాదవ్‌ను నియమించినట్లు ట్రస్టుబోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం జరిగిన ట్రస్టుబోర్డు సమావేశంలో చర్చించి రమేష్‌యాదవ్‌ను నియమించామని అన్నారు. తనను ప్రధాన కార్యదర్శిగా నియమించిన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాజేందర్ పటేల్‌కు, సహకరించిన ట్రస్టుబోర సభ్యులందరికి రమేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి

చిక్కడపల్లి: కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. దళిత హక్కుల రక్షణ హక్కుల రక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు బి.మంగ, తెలంగాణ మాల మహానాడు సాధన సమితి అధ్యక్షుడు మల్లేష్ శుక్రవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, లక్ష్మణ్, నాగెళ్ళి కృష్ణ, ఉత్తమ్‌ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వచనకవిత పోటీలకు ఆహ్వానం

చిక్కడపల్లి: చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఆ పై తరగతుల విద్యార్థుల్లో కవిత రచనా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర స్థాయి వచనకవితల పోటీలు నిర్వహించనుంది. ఈనెల 30వ తేదీలోగా విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీరామమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవితారచన పోటీలు వచ్చే నెల 6వ తేదీన త్యాగరాయ గానసభలో ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.97041 77279.

దోపిడీ దొంగలకు రెండేళ్ల జైలు

కాచిగూడ: రైల్వే స్టేషన్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ శ్రీదేవి ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... యాకత్‌పుర ప్రాంతానికి చెందిన ఇబ్రహీం కుమారుడు షేక్ ఖలీల్ (24) వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన నబి కుమారుడు గులాం హసన్ (23) వృత్తిరీత్యా కూలీ. వీరిద్దరితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు కలిసి 16 నవంబర్ 2023న ఎంఎంటీఎస్ రైలులోకి ప్రవేశించిన ఇద్దరు ప్రయాణికులను కత్తులతో బెదిరించి ఒకరి దగ్గర రూ.15 వేలు, మరొకరి వద్ద రూ.5వేలు, రెండు సెల్ ఫోన్లు తీసుకొని పారిపోయారు. బాధితుల పిర్యాదు మేరకు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం పీపీ సరితరాణి వారిని కోర్టులో హాజరుపరిచారు. బోయగూడ రైల్వే 2 ఎంఎంకోర్టు మెజిస్ట్రేట్ ఎస్.శ్రీదేవి పై విధంగా తీర్పునిచ్చారు.

సొంతింటి కల నెరవేరేనా..?



- 35 ఏళ్లుగా గుడిసెల్లోనే శ్యామ్ ప్రసాద్‌నగర్ బస్తీవాసులు
- ఎన్నికలప్పుడే బస్తీలోకి అడుగుపెడుతున్న నేతలు
- గెలిచిన తర్వాత కనీసం పలకరించడం లేదని ఆవేదన
- అందని ద్రాక్షగా మారిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లు
- ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు



శ్యామ్ ప్రసాద్‌నగర్ బస్తీవాసులు



శ్యామ్ ప్రసాద్‌నగర్ బస్తీలో సుమారు 20 ఇళ్లు ఉన్నాయి. ఇందులో 150 మంది నివసిస్తున్నారు. వీళ్లందరికీ కలిపి రెండు మరుగుదొడ్లు, మూడు స్నానపుగదులు ఉన్నాయి. వారి జీవన స్థితిగతులు చూస్తే అయ్యోపాపం అనాల్సిందే.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని శ్యామ్ ప్రసాద్‌నగర్ బస్తీవాసుల సొంతింటి కల ప్రశ్నార్థకంగా మారింది. 35 సంవత్సరాలుగా ఇక్కడ గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. కాళ్లు చాపుకుని పడుకునేంత స్థలంలో నలుగురు నుంచి ఐదుగురు ఉంటున్నారు. ఇక వర్షాకాలం వచ్చిందంటే వారి కంటికి కునుకు ఉండదు.

◆ అరకొర సౌకర్యాలతో 35 సంవత్సరాలుగా ఇక్కడే జీవిస్తున్నామని తమకెప్పుడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తారో అర్థం కాని పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. కలెక్టర్‌కు నాలుగు సార్లు, తహసీల్దార్‌కు రెండుసార్లు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కట్టించి ఇవ్వాలని వినతి పత్రం అందజేశామన్నారు. తమ వినుతులపై అక్కడి నుంచి ఎలాంటి స్పందన లభించలేదని చెబుతున్నారు.

◆ శ్యామ్ ప్రసాద్‌నగర్ బస్తీవాసులకు ఓటర్, రేషన్‌కార్డులు, కరెంట్ మీటర్లు, నల్లా కనెక్షన్లు, గ్యాస్ కనెక్షన్లు, ఆధార్‌కార్డులు ఉన్నాయి. 2014, 2019, 2023లో ఇలా మూడు దఫాల్లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకుండాపోయింది.

◆ ఈ బస్తీకి ఎన్నికల సమయంలో వచ్చి మీకు ఇళ్లు కట్టించి ఇస్తామని అన్ని పార్టీల అభ్యర్థులు హామీలు ఇస్తున్నారు. గెలిచిన తర్వాత తమను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మమ్ముల్ని ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారే తప్ప తమ సమస్యలను పరిష్కరించడంలేదన్నారు.



బస్తీలో ఉన్న బాత్రుమ్స్

మాకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి



35 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. మాకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. అందరూ వస్తున్నారు.. పోతున్నారు. ఏ ఒక్కరూ మా సొంతింటి కలను నెరవేర్చడం లేదు. ఇరుకు గదుల్లో ఉండలేకపోతున్నాం. కనీస సౌకర్యాలు కూడా లేవు.

– జి.జయమ్మ, బస్తీవాసి

ఎక్కడ ఇచ్చినా పోతాం



మాకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఎక్కడ ఇచ్చినా పోతాం. అందరిని కలిసి ఇళ్లు ఇప్పించమని దండం పెట్టి మొక్కుతున్నాం. వర్షాకాలం వస్తే ఇంట్లోకి నీళ్లు వస్తాయి.కనీసం పడుకోలేం. మేల్కొని ఉండాల్సిందే. ప్రభుత్వం కనికరించి మాకు దారి చూపాలి.

– ఎం.అనంతమ్మ, బస్తీవాసి

నా వంతు ప్రయత్నం చేస్తున్నా..



బస్తీవాసులకు ఇళ్లు ఇప్పించడానికి నా వంతు ప్రయత్నం చేస్తున్నాను. గతంలో కలెక్టర్, తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించాం. త్వరలో కొత్తగా వచ్చిన కలెక్టర్‌ను కూడా కలుస్తా. వీరికి ఇళ్లు ఇవ్వకుంటే కలెక్టరేట్ ఎదుట బస్తీవాసులతో కలిసి ధర్నాకు దిగుతాం.

– కె.రవిచారి, కార్పొరేటర్

జాబ్ కేలండర్ ఏది?

- ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ ఏమైంది?
- 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తామన్న హామీని ఏమనాలి?
- విద్యార్థి నిరుద్యోగ మహాగర్జనలో గళమెత్తిన వక్తలు



విద్యార్థి నిరుద్యోగ మహాగర్జనలో అభివాదం చేస్తున్న జూలకంటి రంగారెడ్డి, ఆర్. కృష్ణయ్య

కవాడిగూడ: జాబ్ కేలండర్ ప్రకటించి ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని నిరుద్యోగులు గళమెత్తారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో శుక్రవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థి నిరుద్యోగ మహాగర్జన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఎంపీ ఆర్. కృష్ణయ్య, కంటెస్టెడ్ ఎమ్మెల్సీలు రాకేష్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బక్క జెడ్సన్, తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకుడు పృథ్వీరాజ్ యాదవ్ తదితరులు మద్దతు తెలిపి మాట్లాడారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా అన్ని కేటగిరిలకు చెందిన 25వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామన్న హామీని 18 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కారణమైన నిరుద్యోగులను విస్మరించడం తగదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పడ్డ కొత్త కార్యాలయాల్లో ఎన్ని ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయనే అంశాలను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం మొక్కుబడిగా నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. ఏడేళ్ల క్రితం ఏర్పడిన కొత్త కార్యలయాలకు నేటికీ పూర్తిస్థాయిలో అధికారులను కేటాయించకపోవడం దారుణమని అన్నారు. ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నీల వెంకటేష్, జనార్దన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్యారా నరేష్, మోతీలాల్ నాయక్, భూక్య సంజీవ్ నాయక్, అస్మా, ప్రత్యుష, అర్జున్, వెంకటేష్, కృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ల సత్యనారాయణ యాదిలో..



మాట్లాడుతున్న హాస్యావధాని శంకరనాయణ, కళా జనార్దనామూర్తి తదితరులు

చిక్కడపల్లి: పాటల వల్ల జైలుకు వెళ్లిన తొలి కవి గరిమెళ్ల సత్యనారాయణ అని హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శుక్రవారం ఎందరో మహానుభావులు శీర్షికల పరంపరలో భాగంగా 'గరిమెళ్ల సత్యనారాయణ యాదిలో..'పేరిట సంసర్మణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శంకరనారాయణ మాట్లాడుతూ... గరిమెళ్ల రచించిన దేశభక్తి పాటలు వల్ల తమపై ప్రజలు తిరుగుబాటు చేస్తారనే భయంతో ఆయనకు జైలు శిక్ష వేశారని చెప్పారు. గాంధీజీ కోరిక మేరకు దళితులపై కొనసాగుతున్న వివక్షకు వ్యతిరేకంగా పాటలు రాసి పాడి ప్రచారం చేశారని తెలిపారు. జానపద త్యాగయ్యగా పేరు గడించిన గరిమెళ్ల సత్యనారాయణ చివరి రోజుల్లో జర్నలిస్ట్ వృత్తిని నిబద్ధతతో చేస్తూ నిరుపేదగా మరణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, కథక్ కళాక్షేత్ర నిర్వాహకుడు డా. అంజుబాబు, సంఘ సేవకులు నైషధం సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దాం



ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఎం సుధా పరిమళ

కాచిగూడ: ఆర్టీసీ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని... కార్మికులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి సంస్థను లాభాల బాటలో నడిపించాలని ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ (ఆర్ఎంం) సుధా పరిమళ సూచించారు. కాచిగూడ బస్ స్టేషన్‌లో ప్రయాణికుల మర్యాద దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో ఉత్తమ సేవలందిస్తూ.. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న ఉద్యోగులు, కార్మికులను ఆమె అభినందించారు. ఉత్తమ సేవలందించిన కార్మికులకు ప్రశంస పత్రాలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కార్మికుల పనితీరుపైనే ఆర్టీసీ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా బస్సు సేవలను అందించడంలో డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర కీలకమని అన్నారు. ప్రయాణికులతో తోటి ఉద్యోగులు, సిబ్బందితో మర్యాదగా వ్యవహరించాలని ఆమె సూచించారు.

ప్రయాణికులకు ఆర్టీసీ 'క్యూఆర్ కోడ్'కీ-చేయిన్స్...

ఆర్టీసీ సమాచారాన్ని తెలిపే 'క్యూఆర్ కోడ్'ఉన్న కీ-చెయిన్స్‌ను ఆమె ప్రయాణికులకు అందజేశారు. కస్టమర్ సర్వీస్, శ్రద్ధ, గౌరవం, వినయంతో కూడిన సేవలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆమె తెలిపారు. బద్రుక కళాశాల డైరెక్టర్ జనరల్ ప్రొ. అభిరామకృష్ణ పాల్గొని ఉత్తమ సేవలందిస్తున్న ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, డాక్టర్ డీవీఎస్ఎన్ మూర్తి, జయభారతి, ఆర్టీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వర్ రావు తెలిపారు. సాయిబాబా ఫీడర్ పరిధిలోని శివం, సాయిబాబా కమాన్, ఆంధ్రబ్యాంక్ , వీహెచ్ హౌస్ తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... పార్శిగుంట ఫీడర్ పరిధిలోని ప్రేయర్ పవర్ చర్చి, బాప్టిస్టు చర్చి, బ్రహ్మంగారి టెంపుల్ తదితర ప్రాంతాలలో ఉదయం 11 నుంచి 11.30 వరకు... తిలక్‌నగర్, గోల్నాక ఫీడర్ల పరిధిలోని తిలక్‌నగర్ క్రాస్‌రోడ్డు, చే నంబర్ క్రాస్ రోడ్డు, అంబర్‌పేట్ మెయిన్ రోడ్డు, జైస్వాల్ గార్డెన్, తిరుమలనగర్, మారుతీనగర్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సెట్విన్‌లో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: భోలక్‌పూర్ ఇందిరానగర్‌లోని ముషీరాబాద్ సెట్విన్‌లో ఉపాధి రంగ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సెట్విన్ ఇన్‌చార్జి సత్యవతి తెలిపారు. శుక్రవారం సెట్విన్‌లో విద్యార్థులకు వివిధ రంగాలలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 10వ తరగతి, ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 3 - 6 నెలల వరకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు సైతం కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 98854 29536, 91105 34518.

హెలెన్ కెల్లర్ జయంతి ఉత్సవాలు 27న

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వికాలాంగులు, మహిళల హక్కుల కోసం పోరాడిన హెలెన్ కెల్లర్ జయంతి ఉత్సవాలను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు ఎన్పీఆర్‌డీ ప్రధాన కార్యదర్శి అడివయ్య, హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల చైర్మన్ ఉమర్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ఉత్సవాలతో పాటు రామిజాబి మెమోరియల్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. చిక్కడపల్లిలోని ఎన్పీఆర్‌డీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల, వికాలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ, ఎన్పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్పీఆర్‌డీ అధ్యక్షుడు బి.వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంగీతం ఆధ్యాత్మిక అనుభూతికి నిదర్శనం కావాలి

చిక్కడపల్లి: సంగీతం ఆధ్యాత్మిక అనుభూతికి నిదర్శనం కావాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. స్వరకల్యాణి ఆర్ట్స్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో శుక్రవారం ఉదయం సినీసంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో గాయని, నిర్వాహకులు స్వరకల్యాణిని సన్మానించిన కృష్ణమోహన్ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పొత్తూరి రంగారావు, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, శేఖర్, కమలశాస్త్రి, కేవీ రావు, నాగభూషణం, షీలారాణి, నరేంద్రనాథ్, వీణా, భారతి, లలిత తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

కాచిగూడ: బనకచర్ల ప్రాజెక్టు ద్వారా నాగార్జున సాగర్ నుంచి గోదావరి నీటిని ఆంధ్రకు తరలించే కుట్రను తెలంగాణ ప్రజలతో కలిసి ప్రభుత్వం అడ్డుకోవాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్ల పాజెక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి జలాలను రాయలసీమ, నెల్లూరు అనంతరం తమిళనాడు ప్రాంతాలకు తరలించే కుట్ర జరుగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోదావరిపై 1000 టీఎంసీలు, కృష్ణానదిపై 500 టీఎంసీల కేటాయింపు తర్వాత మిగతాదంతా ఏపీ ప్రభుత్వం తీసుకుపోవచ్చనే వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో గురుశిష్యుల బంధం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. అన్ని ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిన తర్వాతనే ఆంధ్ర ప్రాజెక్టుల అనుమతులను పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విభజన చట్టం ప్రకారం తెంగాణకు జాతీయ హోదా ప్రాజెక్టు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోల జనార్దన్, తంగెళ్లమూడి నందగోపాల్, సుధాకర్ ముదిరాజ్, ఉదయ్ నేత, హరితిలక్ సింగ్, రజని తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



హుందాబాగ్‌లో వాటర్‌ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో నీటి ఎద్దడి లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. దోమలగూడ హుందానగర్‌లో ఎమ్మెల్యే ముఠాగోపాల్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం బస్తీ వాసులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్‌డీ సాయికృష్ణ, లడ్డు శ్రీకాంత్, బస్తీవాసులు నరహరి, నరేందర్, కిషన్, నాగేష్, పీకే కృష్ణ, పి.యాదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ పార్కుల ఆధునీకరణకు చర్యలు



వైభవ్‌నగర్ పార్కు ఆధునీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: నియోజకవర్గంలో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట వైభవ్‌నగర్‌లోని పార్కు ఆధునీకరణ పనులను శుక్రవారం ఆయన స్థానిక కార్పొరేటర్ పద్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో పలు పార్కులను ఆధునీకరించి సకల హంగులను కల్పించామన్నారు. వ్యాయమం, వాకింగ్, చిన్నారులకు ఆహ్లాదం ఉండేలా తీర్చిదిద్దామని తెలిపారు. దశల వారీగా నియోజకవర్గంలో అన్ని పార్కులను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, చందు, బాల్‌రాజ్, రవీందర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రపంచంలో భారత్ అత్యున్నత స్థాయికి చేరింది'



చిక్కడపల్లి: ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భారత్‌గౌడ్ అన్నారు. బీజేపీ వికసిత భారత్ సంకల్ప సభ శుక్రవారం డివిజన్‌లోని అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 11 సంవత్సరాల పాలనలో ప్రపంచంలో భారత్ అత్యున్నతస్థాయికి చేరిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేలా నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, వి.నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శేషసాయి, శ్రీకాంత్, మీఎస్టీరాజు, సత్తిరెడ్డి, శివకుమార్, ఉమేష్, శ్రీనివాస్, ఆకుల సురేందర్, సురేష్, ఆనంద్‌రావు, విజయలక్ష్మి, సంయుక్తరాణి తదితరులు పాల్గొన్నారు.